నేడు మంత్రి కేటీఆర్ రాక




తొర్రూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పురపాలక, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ బుధవారం మండల కేంద్రంలో పర్యటించనున్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి దయాకర్‌రావుతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. తొర్రూరు పట్టణ అభివృద్ధిపై కేటీఆర్ సమీక్షించనున్నారు. అనంతరం 20 వేల మంది మహిళలతో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతారు. అలాగే మహిళా దినోత్సవ కానుకగా, రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళలకు చెక్కుల రూపంలో అందజేయనున్నారు, అభయహస్తం డబ్బులను కేటీఆర్ ద్వారా మహిళలకు అందిస్తారు. కాగా సభ ఏర్పాట్లు, బైక్‌ర్యాలీ, వివిధ ప్రారంభోత్సవాలపై మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంబంధిత అధికారులతో చర్చించారు. వడ్డీలేని రుణాలు రూ.250కోట్లు పట్టణ ప్రాంత మహిళలకు, రూ.500 కోట్లు గ్రామీణ ప్రాంత మహిళలకు అందిస్తారన్నారు.

హోలీ సంబురాలు



మహబూబాబాద్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎఫ్ఓ రవికిరణ్, ఇతర అధికారులు పాల్గొని రంగులు పూసుకున్నారు.

- మరిన్ని ఫొటోలు 9లో▸



ఆడపిల్లగానే పుడతాం..

మహిళా దినోత్సవం

- ఇప్పటికీ పని ప్రదేశం, కాలేజీల్లో వేధింపులు
- మాకే అధికారం ఉంటే కఠిన శిక్షలు అమలు
- 'సాక్షి' సర్వేలో మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగుల మనోగతం

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సర్వేలో పాల్గొన్న మహిళలు

సాక్షి, మహబూబాబాద్: సృష్టికి మూలం స్త్రీ. అలాంటి స్త్రీలు నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రపంచ వేదికలపై తమ సత్తా చాటుతున్నారు. అయితే ఆదిమకాలం నుంచి నేటి వరకు పురుషాధిక్యత, వివక్ష, వేధింపులు వంటివి కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ ఆఫీసులు, కాలేజీలు, బహిరంగ ప్రదేశాలు, ఇంట్లో వేధింపులు, వివక్షకు గురవుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎన్ని అవాంతరాలు ఎదురైనా తమ లక్ష్యం కోసం నిరంతరం కృషి చేస్తామని, మళ్లీ జన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలని కోరుకుంటామని మానుకోట నారీమణులు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నాలుగు అంశాలపై 'సాక్షి' ఆధ్వర్యంలో సర్వే నిర్వహించింది. వంద మంది మహిళలతో మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించింది. అందరిలో ఒకే అభిప్రాయం లేకపోయినా.. అత్యధిక మంది మాత్రం మరో జన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

నాలుగు అంశాలపై అభిప్రాయ సేకరణ

మహిళల మనోగతం తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో నాలుగు అంశాలను ప్రామాణికంగా తీసుకున్నాం. మీరు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవిస్తున్నారా..?, మహిళగా మీకు ఎక్కువ ఇబ్బంది కలిగిన అంశం..?, మీకే పూర్తి అధికారం ఉంటే మహిళల కోసం ఏం చేస్తారు.?, మళ్లీ జన్మంటూ ఉంటే ఎలా పుట్టాలని కోరుకుంటారు..? అనే అంశాలపై పలువురి నుంచి అభిప్రాయాలు సేకరించాం. ఇలా విద్యార్థినులు, గృహిణులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు పలు రంగాల మహిళలు తమ అభిప్రాయాలు తెలియజేశారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



మహిళల కోసం ప్రభుత్వం ఎన్నో చట్టాలను రూపొందిస్తుంది. వాటిని ఆశించిన స్థాయిలో అమలు చేయడం లేదు. ఇప్పటికైనా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. -ప్రవళిక, గృహిణి

పిల్లల పెంపకంలో వివక్ష చూపొద్దు



చిన్నప్పటి నుంచే వివక్ష మొదలవుతుంది. ఆడ పిల్లలు పుడితే ఒక తీరుగా.. మగపిల్లాడు పుడితో మరోతీరుగా పెంచుతారు. ఇది సరికాదు. వివక్ష లేకుండా వారిని పెంచాలి. -సైదమ్మ, కండక్టర్

నిర్ణయాధికారం ఇవ్వాలి



మగవారితో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నా.. వివక్ష మాత్రం పోలేదు. మహిళలు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం కల్పించాలి. -సుకన్య, బీఈడీ విద్యార్థిని

పరిశీలన.. పర్యవేక్షణ



రా కాపీని చదువుతున్న గెస్ట్ ఎడిటర్ జి.శశి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, వరంగల్

- వార్తల ఎడిటింగ్.. డిజైన్‌లో సలహాలు, సూచనలు
- కథనాల నాణ్యత, ఆధునిక టెక్నాలజీతో ముద్రణ బాగుంది
- సాక్షి గెస్ట్ ఎడిటర్ జి.శశి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, వరంగల్
- వరంగల్ యూనిట్ కార్యాలయం సందర్శన



పేజీ లే అవుట్‌ను పరిశీలిస్తున్న గెస్ట్ ఎడిటర్

సాక్షిప్రతినిధి, వరంగల్: క్షేత్రస్థాయి నుంచి వచ్చిన వార్తలను పరిశీలించి.. ఎడిటింగ్‌లో సలహాలు, సూచనలు అందించారు సాక్షి గెస్ట్ ఎడిటర్ జి.శశి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, వరంగల్. మంగళవారం సాక్షి వరంగల్ యూనిట్ కార్యాలయానికి గెస్ట్ ఎడిటర్‌గా వచ్చిన ఆమె.. ఎడిటోరియల్ విభాగాన్ని పరిశీలించారు. రిపోర్టర్లనుంచి వచ్చిన రా వార్తలను, ఎడిటింగ్ కాపీలను క్షుణ్ణంగా చదివారు. వాటిని సరిదిద్దారు. సమగ్ర వార్తా కథనానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి చేసిన సర్వే వార్తలో మెజారిటీ మహిళల అభిప్రాయం మేరకు మంచి శీర్షికను, పేజీ లే అవుట్‌లో ప్రియారిటీని సూచించారు. సబ్ ఎడిటర్లు చేస్తున్న కాపీ ఎడిటింగ్, ఆర్టిస్టుల పేజీ లే అవుట్‌ను గమనించారు. అంతకుముందు యూనిట్‌లోని ఐటీ, ఏడీవీటీ, సీటీపీ, మిషన్ సెక్షన్లను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు. ముద్రణా తీరును పరిశీలించి ఎంతో అడ్వాన్స్ టెక్నాలజీ ఉందని, అన్ని కలర్ పేజీలతో ప్రింటింగ్ నాణ్యతగా ఉందని అభినందించారు. సుమారు రెండు గంటలపాటు గెస్ట్ ఎడిటర్‌గా కార్యాలయంలో గడిపిన ఆమె అనంతరం తన అనుభవాలను వెల్లడించారు.

హార్డ్‌వర్క్ ఉంటేనే పత్రిక బయటికి..

ఒక దినపత్రిక మార్కెట్‌లోకి రావాలంటే ముందు సంస్థలోని అన్ని విభాగాలు శ్రమించాల్సి ఉంటుందని తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. రోజువారీగా జరిగే సభలు.. సమావేశాలు.. సంఘటనల సమాహారమే వార్తలు.. ఆ వార్తలు, పేజీల కూర్పు కూడా బాగున్నాయన్నారు. అధునాతన టెక్నాలజీతో సాక్షి ముద్రణ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉందన్నారు. ఎప్పుడో చిన్నప్పుడు ఇంగ్లిష్ పత్రిక యూనిట్ ఆఫీస్‌కు వెళ్లానని, మళ్లీ ఇప్పుడు సాక్షి ఎడిషన్‌కు వచ్చినట్లు చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సర్వే రిపోర్టును దినపత్రిక మార్కెట్లోకి రాకముందే చూశానని, గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించడం వల్ల సాధ్యమైందన్నారు.

రెండు కార్లు ఢీ.. ఆరుగురికి గాయాలు

ఖానాపురం: ప్రమాదవశాత్తు రెండు కార్లు ఢీకొన్న సంఘటన మండలంలోని మంగళవారిపేట శివారులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..హన్మకొండ నుంచి హెడ్‌నర్సులు పద్మ, పద్మలత మహబూబాబాద్‌ ఆస్పత్రిలో జాయిన్‌ కావడానికి డ్రైవర్‌ సహజ్‌తో కలిసి కారులో మహబూబాబాద్‌కు వెళ్తున్నారు. ఈక్రమంలో శ్రీనివాస్‌ తన కుటుంబ సభ్యులతో నిర్మల్‌కు కారులో వెళ్తున్నారు. ఈ సమయంలో మంగళవారిపేట శివారులో మూలమలుపు వద్ద ఎదురెదురుగా కార్లు ఢీకొనడంతో కార్ల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. కార్లలో ప్రయాణిస్తున్న వారిలో పద్మలత, పద్మలకు తీవ్రగాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్‌ సుమన్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. గాయపడిన వారిని పోలీస్‌ వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు.


ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

ఆత్మవిశ్వాసమే..ఆమె బలం..



కాటారం: ఓ పక్క భర్తను కోల్పోయి..మరో పక్క అనారోగ్యంపాలైన కొడుకును ముందుంచుకొని సమస్యల కడలిలో కొట్టుమిట్టాడుతూ కుటుంబ పోషణ భుజాన మోస్తూ 19 ఏళ్లుగా ఫొటోగ్రఫీలో రాణిస్తుంది మండల కేంద్రానికి చెందిన పస్తం రాజేశ్వరి. నిరుపేద కూలీ కుటుంబానికి చెందిన రాజేశ్వరి భర్త ఫొటోగ్రాఫర్‌గా మంచి పేరుండగా వృత్తిలో రాణిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. రాజేశ్వరికి ఫొటోగ్రఫీ అంటే ఆసక్తి ఉండేది. భర్తతో పాటు ఫోటో స్టూడియోకి వెళ్లి సరదాగా ఫోటో తీసుకోవడం నేర్చుకుంది. రాజేశ్‌ పక్షవాతానికి గురై కొన్నేళ్ల పాటు మంచానికి పరిమితమయ్యి గత ఏడాది క్రితం మృతి చెందాడు. కుటుంబాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలని దీర్ఘ ఆలోచన చేసిన రాజేశ్వరి బంధువుల సాకారంతో ఫొటోగ్రఫీనే తన వృత్తిగా ఎంచుకొని జీవనం సాగిస్తుంది.

నా బిడ్డలే..నా వారసులు



కాజీపేట అర్బన్‌: బేటీ బచావో బేటీ పడావో అనే నినాదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న ఆ ఇంట్లో అందరు అమ్మాయిలే అయినా కూడా అబ్బాయిలకు దీటుగా ఆ తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెంచడమే కాక ఉన్నత విద్యనందించారు. నా పేరు డాక్టర్‌ చందా మల్లయ్య నా భార్య పేరు విమల. మాకు చందా సృజన, చందా రచన, చందా మేఘనలు ముగ్గురు అమ్మాయిలు మా బిడ్డలు. నేను కేయూలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా విధులు కొనసాగిస్తుండగా నా భార్య కమలాపూర్‌ ఎంపీపీ ఆఫీస్‌లో మండల పంచాయతీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తుంది. మా పెద్ద కుమార్తె వైద్య రంగంలో ఎండీ పూర్తి చేసి యశోద హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్‌ విభాగంలో విధులు నిర్వహిస్తుంది. రెండవ కుమార్తె ఆర్కిటెక్ట్‌ విభాగంలో ఎంటెక్‌ పూర్తి చేసి జెన్‌ఎఎఫ్‌ఏయూ సెంట్రల్‌ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ప్లానింగ్‌ విభాగంలో పనిచేస్తుంది. మూడవ కుమార్తె సివిల్‌ విభాగంలో ఎంటెక్‌ పూర్తి చేసి హైదరాబాద్‌లో స్ట్రక్చరల్‌ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. ముగ్గురు కుమార్తెలను అల్లారుముద్దుగా పెంచుకోవడమే కాక ఉత్తమ స్థాయిలోకి చేర్చడం ఎంతో ఆనందంగా ఉంది.

నారీ శక్తి.. మహిళా దినోత్సవం

పురుషాధిక్య సమాజంలో మహిళలకు అడుగడుగునా వేధింపులు, ఛీదరింపులు ఎదురవుతున్నా యి. అయితే వీటన్నింటినీ లెక్క చేయకుండా ఒంటిచేత్తో కుటుంబ బాధ్యతలను మోస్తూ ముందుకు సాగుతున్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా వాటిని భరిస్తూ కష్టమైనా ఇష్టంగా మార్చుకుంటున్నారు. ఎన్ని ఆటంకాలు ఉన్నా తమ లక్ష్యం ఒకటే అంటూ దూసుకెళ్తున్నారు. ఎంతో కష్టపడి పిల్లలను చదివించి ఉన్నత స్థాయిలో నిలుపుతున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల జీవిత గాథపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

అనాథలకు 'అమ్మ'



జనగామ : జనగామలోని గ్రెయిన్‌ మార్కెట్‌ ఏరియాలోని రాజరాజేశ్వరి సేవాసదన్‌(వృద్ధాశ్రమం) ఎవరూ లేని అభాగ్యులకు నీడనిస్తోంది. గిర్నిగడ్డకు చెందిన భాషపాక రాజేశ్వరి 2018లో వృద్ధాశ్రమం ప్రారంభించింది. జీవితంలో తనకు జరిగిన సంఘటనలు, రోడ్డు పక్కన ఉన్న ఒంటరి వృద్ధులను చూసి చలించిన ఆమె మనసులో తట్టిన ఆలోచనే ఈ ఆశ్రమానికి బీజం పడింది. మేనకోడలు సరోజ ఆర్థికసాయంతో జనగామలో వృద్ధాశ్రమాన్ని స్థాపించి తాను కన్న కలను నిజం చేసుకుంటుంది. రాజేశ్వరి శ్రమంలో 22 మంది వృద్ధులను వారిని కంటికి రెప్పలా చూసుకుంటోంది. వృద్ధాశ్రం సక్సెస్‌గా నడిపిం చేందుకు ఆమె భర్త పూర్తి సహకారం అందిస్తారు.

గృహిణి నుంచి న్యాయమూర్తి వరకు



రఘునాథపల్లి : భర్త ప్రోత్సాహంతో ఉస్మానియా యూనివర్సిటీలో దూరవిద్యలో బీకాం పూర్తిచేసి న్యాయ విద్యనభ్యసించింది గాదె మంజుల . అనంతరం అంధ్రమహిళాసభ లా కళాశాలలో చేరి ఎల్‌ఎల్‌బీలో గోల్డ్‌మెడల్‌ సాధించింది. తన మెట్టినిల్లు అయిన మండలంలోని మండెలగూడెంకు చెందిన మంజుల తన అభిరుచి మేరకు సొంతూరి ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచనతో ఖిలాషాపూర్‌లో ఉంటూ జనగామ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌ ప్రారంభించింది. కొన్నాళ్లకు భర్త అనారోగ్యానికి గురవడంతో..వైద్య చికిత్స నిమిత్తం కుటుంబం హైదరాబాద్‌కు మార్చాను. ప్రస్తుతం అనంతపురం జిల్లా గుంతకల్‌ కోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతోంది. కుటుంబం ఎంత ముఖ్యమో కెరీర్‌ కూడా అంతే ప్రధానమన్నారు.

వనిత 'విజయ'ం



కురవి: ముగ్గురు పిల్లలు అయ్యాక భర్త వదిలేశాడు. ఆ పిల్లల బాధ్యత తల్లి భుజాల మీదనే పడింది. అయితే ఆమె మగరాయుడిలా ధైర్యంగా ముందుకు సాగుతోంది. మండలంలోని కొత్తూరు(సీ) గ్రామానికి చెందిన జన్ను విజయ అన్ని పనుల్లో నిమగ్నమై కుటుంబాన్ని పోషించుకుంటోంది. 25ఏళ్ల క్రితం వివాహం జరుగగా.. భర్త కిరణ్‌ ఆమెతో పాటు బిడ్డల(ఇద్దరు కుమారులు, కూతురు)ను వదిలేసి వెళ్లాడు. పెద్ద కుమారుడు మానసిక దివ్యాంగుడు. కాగా విజయ ప్రతీ పనికి వెళ్తుంది. మగరాయుడిలా దుస్తులు ధరిస్తుంది. ట్రాక్టర్‌ డ్రైవర్‌గా, ఆటో డ్రైవర్‌గా పనిచేస్తోంది. అన్ని తానై కుటుంబాన్ని ముందుకు నడిపిస్తోంది.

మహాలక్ష్మి పుట్టిందని..



కేసముద్రం: ఆడపిల్ల పుడితే చులకనగా చూసే సమాజం ఇది. హేళన చేస్తూ శునకానందం పొందేవారు ఉన్నారు. అయితే అందరూ ఒకేలా ఉండరు కదా.. ఆడపిల్ల పుట్టి ఇంటికి రాగానే పూలతో ఘన స్వాగతం పలికారు. పాపను పూలపాన్పులో పడుకోబెట్టి ఇంటిల్లిపాదిగా సంబురాలు జరుపుకున్నారు. వివరాలు ఇలా.. కేసముద్రంస్టేషన్‌కు చెందిన వెలిశాల సావిన్‌–రమ్యకు 2017లో వివాహం జరిగింది. అక్టోబర్‌ 21, 2020లో మొదటి కాన్పులో రమ్యకు ఆడపిల్ల పుట్టింది. దీంతో ఆ కుటుంబమంతా తమ ఇంట్లో మహాలక్ష్మి పుట్టిందని మురిసిపోయారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జీ అయి ఇంటికి వచ్చిన తల్లీబిడ్డకు పూలతో స్వాగతం పలికారు.పసిబిడ్డను పూలపాన్పుపై పడుకోబెట్టి, బంధుమిత్రులకు స్వీట్లు పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు.

కష్టమైనపనైనా ఇష్టంగా చేస్తున్నా



హన్మకొండ: కష్టమైన పనైనా ఇష్టంగా చేస్తున్నానని టీఎస్‌ ఆర్టీసీ కానిస్టేబుల్‌ ఎం.డి.షాహిద బేగం చెప్పారు. తాను సివిల్‌ ఎస్సై కావాలని అనుకుంది. సివిల్‌ కానిస్టేబుల్‌తో పాటు ఆర్టీసీ విజిలెన్స్‌, సెక్యూరిటీలో కానిస్టేబుల్‌ ఉద్యోగం కోసం ప్రయత్నించింది.. సివిల్‌ పోలీస్‌ ఎస్సై రిక్రూట్‌మెంట్‌లో రాత పరీక్షకు వరకు వచ్చిందని, రాత పరీక్షలో ఎంపిక కాలేకపోయినా చివరకు ఏదైనా ఉద్యోగం సాధించాలనే తపనతో ఆర్టీసీలో ఉద్యోగం సాధించానని చెప్పింది. 2013లో ఈ ఉద్యోగంలో చేరానన్నారు. టీఎస్‌ ఆర్టీసీ వరంగల్‌ రీజియన్‌లో విజిలెన్స్‌, సెక్యూరిటీ విభాగంలో తాను ఒక్కదానినే మాత్రమే మహిళ ఉద్యోగి అయినా పురుషులతో సమానంగా ఉద్యోగం చేస్తున్నాను.

తల్లి మరణ వార్త విని కుమారుడు హఠాన్మరణం


రాధమ్మ(ఫైల్‌) స్వామి(ఫైల్‌)

చెన్నారావుపేట: మరణంలోనూ పేగుబంధం విడవలేదు. తల్లి మరణవార్త విన్న కుమారుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషాద ఘటన వరంగల్‌ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపయ్యపేట గ్రామానికి చెందిన అన్నెబోయిన అన్నెబోయిన స్వామి నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. రెండు రోజుల క్రితమే కుమారుడిని తల్లి రాధమ్మ (58) చూసి వచ్చింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మృతిచెందింది. ఈ వార్త మంగళవారం ఉదయం కుమారుడికి చేరవేశారు. వెంటనే మనోవేదన గురైన కుమారుడు స్వామి(45) గుండెపోటుతో మృతిచెందాడు. తల్లికుమారుడి మృతదేహాలను ఒకదగ్గర చూసిన స్థానికులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


తల్లి, కుమారుడి మృతదేహాలు

కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి

నల్లబెల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మూడుచెక్కలపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన సపావట్‌ చందు(37), తారా దంపతులకు ఇద్దరు పిల్లలు. వీరి కాపురం కొన్నాళ్లు సజావుగానే సాగింది. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో కలహాలు చోటు చేసుకున్నాయి. మనస్థాపానికి గురైన చందు సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్‌నాయక్‌ తెలిపారు.

గుండెపోటుతో ఎలక్ట్రీషియన్‌ ..


తుప్పరి రాజు (ఫైల్‌)

గీసుకొండ: మండల కేంద్రానికి చెందిన తుప్పరి రాజు(40) ఎలక్ట్రీషియన్‌ మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు స్టేట్‌ బ్యాంక్‌ రిటైర్డ్‌ మేనేజర్‌ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ. 5 వేల సాయం అందించారు. ఆ సహాయాన్ని సర్పంచ్‌ దౌడు బాబు, బీఆర్‌ఎస్‌ గ్రామ అధ్యక్షుడు పసుల రాజేందర్‌, నాయకులు అనిత, యుగేందర్‌, పసుల శివన్నారాయణ, భిక్షపతి, సతీష్‌, మొగిలి, బాలరాజు, ఎల్ల స్వాములు బాధిత కుటుంబానికి అందించారు.

జీవితంపై విరక్తి చెంది..

- ఇద్దరు గొత్తికోయ మహిళలు పురుగుల మందుతాగి ఆత్మహత్య

ఎస్‌ఎస్‌ తాడ్వాయి: జీవితంపై విరక్తి చెందిన ఇద్దరు మహిళలు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం భూపతిపూర్‌ గొత్తికోయగూడెంలో మంగళవారం జరిగింది. పెళ్లి చేసుకున్న వారు భర్తలతో విభేదాలకు గురై పుట్టింటి వద్దే ఉంటూ స్నేహంగా ఉంటున్న ఇద్దరిదీ ఒకే రకమైన వ్యథ కావడంతో బలవన్మరణానికి ఒడిగట్టారు. ప్రపంచ మహిళా దినోత్సవానికి ముందు రోజు ఈ సంఘటన చోటుచేసుకోవడం బాధాకరం. తాడ్వాయి మండలం గంగారం పంచాయతీ పరిధిలోని భూపతిపూర్‌కు చెందిన పూణెం లక్ష్మయ్య కూతురు దేవి రెండేళ్ల క్రితం మంగపేట మండలం కొత్తూరు మెట్లగూడెంగుంపునకు చెందిన మడకం రాజుతో వివాహం జరిగింది. కొన్ని రోజులకే విడాకులు తీసుకుని పుట్టింటి వద్దే ఉంటోంది. అలాగే అదే గ్రామానికి చెందిన కల్తీ దేవయ్య కూతురు విమలకు ఏడాది క్రితం ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రానికి చెందిన పాదెం సతీశ్‌తో వివాహమైంది. పెళ్లయిన ఆరు నెలల తర్వాత భర్తతో గొడవపడి పుట్టింటికొచ్చింది. రెండు, మూడుసార్లు భార్య కోసం సతీశ్‌ అత్తగారింటికి వచ్చినా విమల వెళ్లలేదు. మళ్లీ ఈనెల 5న భార్య కోసం సతీశ్‌ రాగా.. ఆమె వెళ్లనని చెప్పింది. దీంతో దేవి, విమల ఇద్దరూ స్నేహితురాళ్లు కావడం.. కాపురానికి వెళ్లకపోవడంతో ఇద్దరి తల్లిదండ్రులు ఊరి పెద్దమనుషులకు చెప్పి సోమవారం మందలించారు. దీంతో మంగళవారం అందరూ పనులకు వెళ్లిన తర్వాత ఇద్దరు స్నేహితురాళ్లు కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం ఇళ్లకు చేరుకున్న తల్లిదండ్రులకు వీరిద్దరూ కనిపించకపోవడంతో గ్రామస్తులతో కలిసి సమీప అటవీ ప్రాంతంలో వెతికారు. అయితే భూపతిపూర్‌ శివారు గుట్ట దగ్గర దేవి, కమల ఇద్దరూ పురుగుల మందుతాగి విగత జీవులుగా పడి ఉన్నారని సమాచారం అందుకున్న వారి తల్లిదండ్రులు వెళ్లి చేసేసరికి మృతిచెంది ఉన్నారు. దీంతో ఇద్దరి తండ్రులు దేవయ్య, లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మృతిచెందిన విమల, దేవి

దొంగతనం ఒప్పుకోమ్మని బెదిరింపులు

- పురుగుల మందు తాగిన యువకుడు
- వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


వంశీకృష్ణ (ఫైల్‌)

గీసుకొండ: తన స్నేహితుడి ఇంటిలో దొంగతనానికి పాల్పడింది తనే అంటూ అతడి తల్లిదండ్రులు ఆరోపించడంతోపాటు దొంగతనాన్ని ఒప్పుకొమ్మని పోలీసులు వేధించడంతో ఓ యువకుడు మనస్తాపం చెంది సోమవారం క్రిమిసంహార మందు తాగాడు. వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తల్లి రాధ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్‌ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలిలో పోలం వంశీ కృష్ణ(25) అనే యువకుడు తన తల్లి రాధతోపాటు అమ్మమ్మ బుచ్చమ్మ ఇంటిలో ఉంటున్నాడు. అతడి స్వస్థలం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి కాగా తండ్రి ప్రభాకర్‌ ఇటీవల చనిపోగా ఇల్లు లేకపోవడంతో శాయంపేటలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి ఉంటున్నారు. ఫిబ్రవరి 28న శాయంపేట హవేలిలోని ఆవుల కుమారస్వామి–సుజాత దంపతుల ఇంటిలో దొంగలు పడి 7 తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. ఆవుల కుమారస్వామి కుమారుడు మనోజ్‌, పోలెం వంశీకృష్ణ మంచి స్నేహితులు కావడంతో వారి ఇంటి వద్ద చనువుగా ఉండేవాడు. దొంగతనం జరిగిన విషయాన్ని కుమారస్వామి ఈ నెల ఒకటిన గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వంశీకృష్ణపై అనుమానం ఉందని మౌఖికంగా పోలీసులకు చెప్పడంతో వారు గీసుకొండ పోలీస్‌స్టేషన్‌కు రావాలని అతనికి ఫోన్‌ చేసి పిలిపించి విచారించారు. స్టేషన్‌లోని కొందరు పోలీసులు చేయని దొంగతనాన్ని ఒప్పుకొమ్మని వంశీకృష్ణపై ఒత్తిడి తేవడం, బెదిరింపులకు పాల్పడటంతో తన బాధను తల్లికి చెప్పుకుని బాధపడ్డాడు. తన స్నేహితుడి తల్లిదండ్రులు తనపై తప్పుడు ఆరోపణలు చేయడంతో ఆతడు మానసికంగా కుంగిపోయి ఈ నెల 6న క్రిమిసంహారక మందు తాగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి స్పృహతప్పి పడిపోయాడు. పరిస్థితి విషమించడంతో అతడిని వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ విషయమై గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌ సట్ల రాజును వివరణ కోరగా వంశీకృష్ణను దొంగతనం చేసినట్లు ఒప్పుకొమ్మని పోలీసులు బలవంతపెట్టడం, వేధించడం, బెదిరింపులకు పాల్పడటం చేయలేదని తెలిపారు. అతన్ని కేసు విషయంలో స్టేషన్‌కు పిలిపించిన విషయం వాస్తవమేనని, బయట క్రిమిసంహారక మందు తాగి లోపలికి వచ్చి నురగలు కక్కుతూ కిందపడి పోయాడని తెలిపారు.

వానకొండయ్య జాతర అభివృద్ధికి కృషి


కడవెండిలో స్వామి కల్యాణోత్సవానికి తలంబ్రాలు తీసుకెళ్తున్న మంత్రి ఎర్రబెల్లి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


కల్యాణోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి, కలెక్టర్‌

దేవరుప్పుల : చారిత్రాత్మక శ్రీ వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి జాతర అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం కడవెండిలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్‌ ఆలయం నుంచి మూలవిరాట్‌ కల్యాణోత్సవానికి తలంబ్రాలు, చేనేత కార్మికులచే పట్టు వస్త్రాలు నేసి ఊరేగింపులో కళాకారులతో కలిసి కోలాటం ఆడుతూ.. చిడతలు వాయిస్తూ.. డప్పు కొడుతూ.. ఉత్సాహంగా ఆయన తరలివెళ్లారు. మార్గమధ్యలో పొట్టిగుట్టతండాలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ ప్రారంభం అనంతరం రూ.4 కోట్లతో గుట్టపైకి ఘాట్‌రోడ్డు, కల్యాణమండపం, పలు మౌలిక వసతుల కల్పనకు కలెక్టర్‌ శివలింగయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. పూజారి సంపత్‌కుమారచార్యులు పర్యవేక్షణలో సాయి కిరణాచారీ, రంగాచారి నిర్వహించిన కల్యాణోత్సవంలో తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి సమాజం నెలకొనే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్‌ శివలింగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశమ్‌, వైస్‌ఎంపీపీ విజయ్‌, సర్పంచ్‌లు పోతిరెడ్డి బెత్లీనాలీనారెడ్డి, మూడ శంకర్‌, ఉపసర్పంచ్‌ నగేష్‌, ఎంపీటీసీ సభ్యురాలు దుబ్బాక కవితరత్నాకర్‌రెడ్డి, తహసీల్దార్‌ రవీందర్‌రెడ్డి, దయాకర్‌, సుందర్‌రావిఎరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి

సిద్దిపేట కమాన్‌: డెలివరీ కోసం ఆస్పత్రికి వచ్చిన మహిళ గర్భంలోనే శిశువు మృతి చెందిన ఘటన సిద్దిపేటలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోశన్నపేటకు చెందిన నాగలక్ష్మి తన భర్త నర్సింహులు, బంధువులతో కలిసి మంగళవారం ఉదయం డెలివరీ కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. వైద్యసిబ్బంది ఉదయం నుంచి రెండుసార్లు స్కానింగ్‌ తీసి కడుపులో బిడ్డ బాగుందని చెప్పారు. మూడోసారి స్కానింగ్‌ చేసి బిడ్డ హార్ట్‌బీట్‌ తగ్గిందని, ఆ తర్వాత కొద్దిసేపటికి కడుపులో బిడ్డ చనిపోయిందన్నారు. బాధిత కుటుంబ సభ్యులు నిరసన తెలుపగా కడుపులో ఉన్న బేబి మెడకు పేగులు చుట్టుకోవడం వల్లే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారన్నారు. ఈ విషయమై ఆస్పత్రి ఆర్‌ఎంఓను వివరణ కోరగా నాగలక్ష్మి డెలివరీ కోసం ఉదయం ఆస్పత్రికి వచ్చిందని, ఉదయం నుంచి తాము నార్మల్‌ డెలివరీ కోసం ప్రయత్నం చేశామన్నారు. ఉదయం కడుపులో బేబీ బాగున్నా, సాయంత్రం సమయంలో బేబీ మెడకు తల్లి పేగులు చుట్టుకోవడంతో ఊపిరాడక కడుపులోనే చనిపోయిందని తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు డ్యూటీ డాక్టర్‌పై కమిటీ వేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

HOUSE FOR SALE

■ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-26778]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్‌ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్‌: 7660008666, 8309035091. [WA-26776]

PLOT FOR SALE

■ హన్మకొండలోని రెడ్డిపురం కెనాలు కట్ట దగ్గర 374 గజాల ప్లాటు అమ్మడానికి ఉంది దగ్గరలో వైన్లు ఉన్నందున కేవలం గజానికి 12,000 రూ॥లు మాత్రమే. సెల్‌: 9246890951. [W-775786]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్‌ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-26774]

SERVICES

LOANS

■ బాలాజీ కన్సల్టెంట్‌ : (IT రిటర్న్స్‌, GST, పాన్‌కార్డ్స్‌) చేయబడును. బిజినెస్‌ లోన్స్‌, మార్టిగేజ్‌, పర్సనల్‌ లోన్స్‌ ఇప్పించబడును. కాకతీయ థియేటర్‌ దగ్గర, వరంగల్‌. సంప్ర॥ 85228 25358, 97014 32388. [M-1190583]

WANTED

■ వరంగల్‌లోని చికెన్‌ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్‌ కావలెను. జీతం: 21000+ రూం+ భోజనం ఫ్రీ. సెల్‌: 6281342090, 9949857816 [WA-6909]

■ Delicious Farms Chicken outlets is hiring for following positions in Warangal. 1) Collection Executive / Delivery Executive, 2) Accounts Executive Relevant experience is mandatory Age 20-35 yrs, Cont: 8106112401. [W-775840]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకు ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్‌ ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్ర : 90300 07628 [L-537]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-781924]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్‌ చేయండి. 9573633520, 9059633520 [M-1190584]

■ అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్‌ చూసి కొత్తరికార్డ్స్‌ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్‌ చేయండి. 7730899508 [G-514]

■ సె॥సూపర్‌ వైజర్స్‌ - 17000/-, సె॥గార్డ్స్‌ - 14000/- మరియు ఫీల్డ్‌ ఆఫీసర్స్‌ కావలెను. ఏరియా బాలానగర్‌, బాచుపల్లి, మణికొండ, జీడిమెట్ల, జూబ్లీహిల్స్‌, Q: 10th- Degree, మెట్రో మేనేజ్‌మెంట్‌ సర్వీసెస్‌. ఫోన్‌ 9885657755 [H-792981]

■ లేపాక్షి హోంకేర్‌ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్‌ కమీషన్‌ 5K. Ph: 9640300074 [HA-1047]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్‌ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్‌ 9010144453
జయశంకర్‌ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.